# వరంగల్ వాయిస్

*Evening Daily*

సంపుటి : 04 | సంచిక : 198
పేజీలు : 08 | వెల: రూ.5/-

బుధవారం
మే 07, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## భూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుదాం



- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ఇల్లందలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

8లో..



# ఆపరేషన్ సిందూర్



## గర్జించిన భారత్ సైన్యం

- పాక్ గడ్డపై బాంబుల వర్షం
- ఉగ్రస్థావరాలు లక్ష్యంగా దాడులు
- కనీసం వందకు పైగానే ఉగ్రవాదుల హతం
- సైన్యానికి మనో ధైర్యం ఇచ్చేలా గురువారం ర్యాలీ

ప్రపంచమంతా నిద్రపోతోంది. భారత యుద్ధ విమానాలు గర్జించాయి. పాక్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడింది. ఉగ్రమూకలు లక్ష్యంగా 'ఆపరేషన్ సిందూర్' చేపట్టింది. సరిగ్గా పహల్గాం దాడి జరిగిన పక్షం రోజులకు మంగళవారం అర్ధరాత్రి భారత్ ప్రతీకారాగ్నితో ప్రత్యర్థి పాక్ గగనతలం సింధూర కాంతులతో ఎరుపెక్కింది. టెర్రరిస్టులు దాక్కున్న తొమ్మిది కలుగుల్లోకి దూరి భారతీయ విస్ఫోటక అస్త్రాలు నేలమట్టం చేశాయి. కేవలం అరగంటలోనే భారత్ సైనికులు తమకు అప్పగించిన కార్యాన్ని ముగించారు. వాటిల్లో దాక్కున్న టెర్రరిస్టులు ఎంతమంది చచ్చారో లెక్క తేలాల్సివుంది. అంచనాకైతే వందమందికి పైనే ఉంటారని తెలుస్తోంది. చిమ్మచీకట్లో పెళపెళమంటూ శత్రుభూమిలో భారత్ నిప్పులు కురిపించిందని తెల్లారేసరికల్లా తెలిసి యావత్తు ప్రపంచం ఉలిక్కి పడింది. పాకిస్తాన్ వెన్నులో అయితే వణుకే పుట్టింది. ఉన్మాదుల కాల్పుల్లో తమ భర్తల్ని కోల్పోయిన భారత స్త్రీలు గర్వంతో ఉప్పొంగిపోయారు. చరిత్రలో నిలిచిపోయే ఈ భారతీయ ప్రతీకార దాడికి ప్రపంచదేశాలన్నీ దన్నుగా నిలిచాయి. భారత్ ను దోషిగా నిలబెట్టాలని చివరి క్షణంలో పాకిస్తాన్ భద్రతాసమితిలో చేసిన దింపుడు కళ్లెం ప్రయత్నం బెడిసికొట్టింది. ఒక్కదేశం కూడా పాక్ తో కలిసి రాలేదు. - వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు2లో..



8లో..

## పేదవారి కళ నెరవేర్చడమే లక్ష్యం

- చిత్తశుద్ధితో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




2లో..

## తెలుగును కాపాడుకుందాం

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్
- కవులు, రచయితలు, తెలుగు భాషాభిమానుల ఆధ్వర్యంలో చర్చాగోష్ఠి



2లో..

## ఘనంగా భద్రపీఠ సేవ

ఎనిమిదో రోజు భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలు

పాల్గొన్న కుడా చైర్మన్ ఇనగాల, ఎమ్మెల్సీ సారయ్య

# ఆపరేషన్ సింధూర్

- గర్జించిన భారత్ సైన్యం
- పాక్ గడ్డపై బాంబుల వర్షం
- ఉగ్రస్థావరాలు లక్ష్యంగా దాడులు
- కనీసం వందకు పైగానే ఉగ్రవాదుల హతం
- సైన్యానికి మనో ధైర్యం ఇచ్చేలా గురువారం ర్యాలీ



**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో అమాయక ప్రజలపై జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం 'ఆపరేషన్ సింధూర్' చేపట్టింది. బుధవారం తెల్లవారుజామున పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై భారత యుద్ధ విమానాలు మెరుపు దాడులు నిర్వహించాయి. పాకిస్తాన్ లోని నాలుగు, ఆక్రమిత కాశ్మీర్ లోని ఐదు ఉగ్రస్థావరాలను వైమానికదలం కేవలం అరగంటలోనే భస్మీపటలం చేశాయి. అర్ధరాత్రి 1.05 గంటలకు ప్రారంభమైన ఆపరేషన్ సింధూర్ 1.30 గంటలకు ముగిసింది. భారత సైన్యం పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై నిర్వహించిన కచ్చితమైన దాడులలో సుమారు 90 మంది ఉగ్రవాదులు హతమైనట్లు సమాచారం. భారత సైన్యం, వైమానిక దళం, నావికా దళం సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో కొట్లీ, బహవల్పూర్, ముజఫరాబాద్, మురిద్కే, అహ్మద్‌పూర్ ఈస్ట్ సహా మొత్తం 9 ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నారు. ఈ దాడులు జైషే మహమ్మద్, లష్కరే తోయిబా వంటి ఉగ్రవాద సంస్థలకు చెందిన సీనియర్ నాయకులను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగాయి.

### గుర్తించిన ఎన్‌టీఆర్ఓ..

పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లో దాక్కున్న ఉగ్రవాదులను జాతీయ సాంకేతిక పరిశోధన సంస్థ ఎన్‌టీఆర్ఓ గుర్తించింది. వారి స్థానాల గురించి నిఘా సమాచారాన్ని అందించింది. భారత దాడుల్లో అనేక మంది అగ్ర ఉగ్రవాద కమాండర్లు మరణించి ఉండవచ్చని భారత సైన్యం అంచనా వేస్తోంది. ఎన్‌టీఆర్ఓ అనేది 2004లో స్థాపించబడిన భారతదేశ సాంకేతిక నిఘా సంస్థ. ఇది జాతీయ భద్రతా సలహాదారు, ప్రధాన మంత్రి కార్యాలయం కింద పనిచేస్తుంది. అధునాతన సాంకేతిక నిఘాను సేకరించడం, భారతదేశ జాతీయ భద్రతను కాపాడటంలో ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా ఉగ్రవాదం, సైబర్ బెదిరింపులు, సరిహద్దు ముప్పులను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అత్యాధునిక సాంకేతికత పరికరాలను ఉపయోగించడం వలన ఉగ్రవాదులను ట్రాక్ చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషించింది. ఈ మెరుపు దాడులకు సంబంధించిన వివరాలను కేంద్ర రక్షణ, విదేశాంగ శాఖ మీడియాకు వెల్లడించింది. భారత ప్రభుత్వం ప్రకటన అనంతరం ఇండియన్ ఆర్మీ స్పందించింది. 'న్యాయం జరిగింది' అని ఎక్స్‌లో పోస్టు చేసింది. తాజాగా ఈ విషయంపై కేంద్రం నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ విలేకరులతో మాట్లాడారు.

### విమాన సర్వీసులు రద్దు..

పహల్గాం ఉగ్రదాడికి భారత్ గట్టిగా ప్రతీకారం తీర్చుకుంది. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్, పీఓకేలోని 9 ఉగ్ర స్థావరాలపై మెరుపు దాడులకు పాల్పడిరది. ఈ పరిణామాల నేపథ్యంలో భారత గగనతలంలో కొంత మేర కేంద్రం ఆంక్షలు విధించింది. దీంతో ఇప్పటికే అనేక విమాన సర్వీసులు రద్దయ్యాయి. బుధవారం ఉదయం నుంచి దేశవ్యాప్తంగా 18 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేశారు. గగనతలంపై ఆంక్షల నేపథ్యంలో అమృత్‌సర్, బికనేర్, చండీగఢ్, ధర్మశాల, గ్వాలియర్, జమ్మూ, జోధ్‌పుర్, కిషన్‌గఢ్, లేహ్, రాజ్‌కోట్, శ్రీనగర్ సహా పలు ఎయిర్‌పోర్టుల నుంచి మే 10వ తేదీ ఉదయం 5.30 గంటల వరకు 165కి పైగా విమాన సర్వీసులను రద్దు చేస్తున్నామని ఇండిగో ఓ ప్రకటనలో వెల్లడిరచింది.

### సీఎం రేవంత్ అత్యవసర భేటీ..



ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత రెడ్డి బుధవారం పలువురు ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన ఈ సమీక్షకు సీఎస్, డీజీపీలతో పాటు అందుబాటులో ఉన్న స్థానిక మిలిటరీ అధికారులు, డిజాస్టర్ మేనేజ్మెంట్ అధికారులు పాల్గొన్నారు. యుద్ధం నేపథ్యంలో ప్రజలు భయభ్రాంతులకు గురి కావద్దని, అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఏవైనా అనుమానాలుంటే వెంటనే పోలీసు విభాగానికి ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.




# తెలుగును కాపాడుకుందాం

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత అంపశయ్య నవీన్
- కవులు, రచయితలు, తెలుగు భాషాభిమానుల ఆధ్వర్యంలో చర్చాగోష్ఠి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలుగు భాషను కాపాడుకుందామని కవులు, రచయితలు, తెలుగు భాషాభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చాగోష్ఠిలో ముక్త కంఠంతో ప్రకటించారు. బుధవారం ఉదయం హనుమకొండలోని శ్రీ రాజరాజ నరేంద్రాంధ్ర భాషానిలయంలో తెలుగు భాషా పరిరక్షణ సమితి, ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో తెలుగు భాషను సంరక్షించే దిశగా చర్చాగోష్టిని కవులు, రచయితలు, తెలుగు భాషాభిమానులతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి, విమర్శకులు, విశ్రాంత ప్రధానాచార్యులు అచార్య బన్న అయిలయ్య అధ్యక్షత వహించి మాట్లాడారు. ఇటీవల ఇంటర్మీడియట్ విద్యలో రెండో ఐచ్ఛికం గా సంస్కృతాన్ని తీసుకోవాలని బోర్డు జారీ చేసిన ఉత్తర్వులతో తెలుగు భాషను ఇంటర్ విద్యలో లేకుండా చేసే కుట్రగా భావించాలన్నారు. తెలుగు భాషా స్థానంలో తెలుగేతర భాషలను ప్రవేశ పెట్టి తెలుగు భాషా వికాసాన్ని అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత అంపశయ్య నవీన్ మాట్లాడుతూ దేశంలోని అనేక రాష్ట్రాలలో తెలుగు మాట్లాడేవారు చాలా మంది ఉన్నారని, 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని శ్రీకృష్ణ దేవరాయలు అన్నారని గుర్తు చేస్తూ ఇటువంటి భాషను పాలకులు నిర్లక్ష్యం చేయడం విచారకరమైన విషయమని పేర్కొన్నారు.
ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ మాతృ భాష మృత భాష కాకూడదని అది అమృత భాష అని, దీనిని కాపాడుకోవలిసిన బాధ్యత అందరిదని అన్నారు. ఇక్కడే రోజు వారీ కూలీ నుండి రాజకీయ నాయకుడి వరకు అందరూ మాట్లాడేది తెలుగు భాషనే అని ప్రజా పాలనకు సంబంధించిన సంక్షేమపథకాలు ప్రజలలోకి చేరవేసే వాహిక సరళమైన సాహిత్యం, పాటల రూపంగా తెలుగులోనే ప్రజలవద్దకు చేరుతుందని, అట్లాంటి తెలుగు భాషను కాదని సంస్కృత భాషను ప్రవేశపెట్టడం సమంజసం కాదని పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమానికి హజరైన కవులు, రచతలు, తెలుగు భాషాభిమానులతో చర్చాగోష్టి నిర్వహించి ఏకగ్రీవంగా పలు తీర్మాణాలు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజామనోహర్ బాబు, నాగిళ్ళ రామశాస్త్రీ, బిల్ల మహేందర్, పి.చందు, వీఆర్ విద్యార్థి, దహగం సాంబమూర్తి, డాక్టర్ మంథని శంకర్, డాక్టర్ లగడపాటి రాజ్ కుమార్, వాసిరెడ్డి కృష్ణారావు, వల్సపైడి, రాంబ్రహ్మాచారి, సొన్నాయిల కృష్ణవేణి, ఎన్వీ శ్రీదేవి, మురాడి శ్యామల, మెరుగు అనురాధ, శాఖమూరి అప్పారావు, పిట్టా సాంబయ్య, అంజనీదేవి, చక్రవర్తుల రాధాకృష్ణ, డాక్టర్ మడత భాస్కర్, నిధి, రాధిక నరేన్, శివరంజని, చిరంజీవి, విద్యాదేవి, తదితరులు పాల్గొని మాట్లాడారు.





# ఘనంగా భద్రపీఠ సేవ

- ఎనిమిదో రోజు భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలు
- పాల్గొన్న కుడా చైర్మన్ ఇనగాల, ఎమ్మెల్సీ సారయ్య

**వరంగల్ వాయిస్, వరంగల్ :** చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో భద్రకాళి, భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలు బుధవారం ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. అమ్మవారికి ఉదయం భద్రపీఠ సేవ సాయంకాలం అశ్వవాహన సేవను నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో ఈ రోజు ఉభయదాతలుగా ఉమ్మడి వరంగల్ జిల్లా పెరిక కుల సంఘం వారు వ్యవహరించారు. పెరిక కుల సంఘం ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిలుగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, అతిథులుగా నాయిని అమరేందర్ రెడ్డి, నాయిని లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెరిక కుల ప్రముఖులు అమ్మవారికి పట్టువస్త్రాలు, పూలు, పండ్లు, పూజాద్రవ్యములను అమ్మవారికి సమర్పించుకున్నారు. అనంతరం అమ్మవారికి శోడషోపచారపూజ జరిపి అమ్మవారి అనుజ్ఞతో స్నపన మండపంలోకి ప్రవేశించి అమ్మవారికి అభిషేకం చేశారు. తదుపరి మహిళలు కుంకుమార్చన, డోలోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తకోటి హాజరై అమ్మవారికి భద్రపీఠ సేవ నిర్వహించారు.

# ధాన్యం కొనుగోళ్లలో భారీ అవినీతి



## ◆ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత పెద్ది ఆరోపణలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రాష్ట్ర సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. స్థానిక నాయకులతో కలిసి మాట్లాడిన ఆయన, రాష్ట్రంలో నిధులే లేవంటూ చెప్పుకుంటూనే కాంగ్రెస్ నాయకులు అవినీతి, కుంభకోణాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అన్ని శాఖల్లో అవినీతి పెరిగిపోయిందని, రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారని వ్యాఖ్యానించారు. పంటల కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. వాస్తవంగా ధాన్యం కొనుగోలు బ్రహ్మాండంగా జరుగుతోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెబుతున్నా, టెండర్లు మాత్రం ఆలస్యంగా పిలవడం, పరికరాల కొరత అన్నీ అవినీతికి నిదర్శనమని పేర్కొన్నారు. గ్రేడింగ్ మిషన్లు, టార్పాలిన్లు, మ్యాచర్ మిషిన్లు, కాంటా మిషిన్ల కొరతతో రైతులు కల్లాల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని చెప్పారు. పరికరాల కొనుగోలులో కూడా భారీగా అవినీతి జరుగుతోందని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యాన్ని దిగుమతి చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అమ్ముతూ బోనస్‌ను దోచుకుంటున్నారని, రైతులకు న్యాయం జరగడంలేదని విమర్శించారు. సీసీఐ పత్తి కొనుగోలులో జరిగిన రూ. 3,000 కోట్ల కుంభకోణంపై రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని చెప్పారు. స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ అంశంపై స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో పలువురు మాజీ చైర్మన్లు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# డీలర్లకు ఈ-పాస్ యంత్రాల పంపిణీ




**వరంగల్ వాయిస్, జనగామ:** జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధ్యక్షతన బుధవారం జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సీఐఎల్ కంపెనీ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ నిర్వహించిన ఈ-పాస్ యంత్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ, జిల్లాలోని 249 ఎరువుల డీలర్లకు ఈ యంత్రాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. డీలర్లు కొన్ని ముఖ్యమైన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా, డీలర్లు తమ లైసెన్సు కాలపరిమితిని సమీక్షించుకోవాలి. లైసెన్సులో నమోదు చేసిన కంపెనీల ఉత్పత్తులు మాత్రమే విక్రయించాలి. విక్రయించిన ప్రతి స్టాక్‌కి రసీదు ఇవ్వడం తప్పనిసరి అని పేర్కొన్నారు. అలాగే షాప్‌లో ఉన్న భౌతిక స్టాక్‌కు, మిషన్‌లో నమోదు చేసిన స్టాక్‌కు తేడా లేకుండా ఉండాలని, స్టాక్ బోర్డు తప్పకుండా ప్రదర్శించాలని సూచించారు. రైతులకు అసౌకర్యం కలుగకుండా వ్యాపారం జరగాలని, సమన్వయంతో పనిచేయాలని కోరారు. రాబోయే వానాకాలం-2025 సీజన్‌కు అవసరమైన విత్తనాలు ముందుగానే అందుబాటులో ఉంచాలని, స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. అన్ని రకాల విత్తనాలు, ఎరువులు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి, లేదంటే తగిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి డి.రామరావ్ నాయక్, వ్యవసాయ సహాయ సంచాలకులు వసంత సుగుణ, వ్యవసాయ అధికారి కె. నిర్మల, మండల వ్యవసాయ అధికారులు, సీఐఎల్ ప్రతినిధి సజ్జన్ శ్రీధర్ రెడ్డి, అనేకమంది డీలర్లు పాల్గొన్నారు.

# బడి బాట కరపత్రాల ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** బడి బాట కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ముందస్తుగా ప్రొఫెసర్ జయశంకర్ ఎంపీయూపీఎస్ పంగిడిపల్లిలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం కమలాపూర్ మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల (బాయ్స్)లో జరిగింది. ఆవిష్కరణ కార్యక్రమంలో కమలాపూర్ మండల అభివృద్ధి అధికారి గుండె బాబు, ఎంఈఓ కె. శ్రీధర్, ఐకేపీ ఏపీఎం నారాయణ, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్, ఎంపీయూపీఎస్ పంగిడిపల్లి ప్రధానోపాధ్యాయుడు ప్రతాపగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే ఉప్పల్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, సీఆర్పీ శుభాష్, ఎంఐసీ నాగేంద్ర, ఎంపీయూపీఎస్ పంగిడిపల్లి ఉపాధ్యాయులు, ఏఏపీసీ చైర్‌పర్సన్ డి. రాధ, వీఓ బి. మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గణపతిని దర్శించుకున్న ప్రముఖులు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేట స్వయంభు శ్రీ శ్వేతార్క మూల గణపతి దేవాలయ దివ్య క్షేత్రాన్ని దర్శించుకున్న పూర్వ హనుమకొండ డిస్టిక్ జడ్జి, ప్రస్తుత తెలంగాణ హానర్ బుల్ ఉప లోకయుక్త తెలంగాణ బీఎస్ జగ్ జీవన్ కుమార్ బుధవారం దేవాలయానికి సతీ సమేతంగా విచ్చేశారు. వీరిని దేవాలయ మర్యాదలతో దేవాలయ పరిపాలన నిర్వాహకులు అయినవోలు సాయి కృష్ణ శర్మ పూర్ణ కలశ మహా మంత్రోచ్ఛారణ నడుమ స్వాగతం పలికారు. తొలుత క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ అది మూల గణపతి స్వామి వారిని దర్శనం చేసుకుని అనంతరం దేవాలయంలో కొలువై ఉన్న 29 దేవత మూర్తులను దర్శనం చేయించుకొని అనంతరం శ్వేతార్క మూల గణపతి స్వామి వారి వద్ద అయినవోలు రాధాకృష్ణశర్మ దేవాలయ వైదిక కార్యక్రమ నిర్వాహకులు స్వామివారి సన్నిధానంలో అష్టోత్తర షోడశ ఉపచార పూజ, సంకల్ప సహిత శ్వేతార్క అర్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారి హారతి, తీర్థ ప్రసాద వితరణ, స్వామివారి శేష వస్త్రం, చిత్రమాలిక చిత్రపటం, వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాజీపేట మండల రెవెన్యూ అధికారి బావ్ సింగ్, హనుమకొండ రెవెన్యూ డిపార్ట్మెంట్ అధికారి రమేష్ రాథోడ్, కాజీపేట మండల ఆర్ఐ శివ, స్థానిక పోలీస్ ఉన్నతాధికారులు ఎస్సై లవన్ కుమార్, కానిస్టేబుళ్లు, దేవాలయ సిబ్బంది మేనేజర్ లక్క రవి, పీఆర్వో మణిదీప్, శ్రీనివాస్ రావు, పాక పవన్, పాక సాత్విక్, పాక యశ్వంత్, వరికోల్ సాయికుమార్, దేవాలయ అర్చకులు హరికృష్ణ స్వామి, ఆనంద్ కుమార్ త్రిపాఠి, మనోజ్ త్రిపాఠి, రోహిత్ ఉపాధ్యాయ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ సింధూర్‌పై హర్షం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ముక్కుపచ్చని మహిళల సింధూరాన్ని పైశాచికంగా తుడిచి వేసిన ముష్కరులకు తగిన శాస్తి కల్పించాలనే సంకల్పంతో చేపట్టిన చర్యే "ఆపరేషన్ సింధూర్". పసుపు, కుంకుమలకు ప్రతీకలైన భారత మహిళల గౌరవాన్ని కాపాడేందుకు ముందుకెళ్లిన మన వీర సైనికుల ప్రదర్శనకు దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోంది. కాశ్మీర్‌లోని పెహల్గాం వద్ద జరిగిన అమానవీయ సంఘటన ప్రపంచాన్ని నివ్వెరపోయేలా చేసింది. మానవతా విలువలను కాపాడాలనే లక్ష్యంతో ముష్కరులపై ఈ ప్రతీకార చర్యను ప్రారంభించారు. దేశం నలుమూలల నుంచి ప్రజలు మన జవాన్ల ధైర్యసాహసాలకు హర్షం వ్యక్తం చేస్తూ "విజయోస్తు వీర సైనికా" అంటూ అభినందనలు తెలుపుతున్నారు. హింసను వ్యతిరేకించే ప్రతి ఒక్కరూ ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నారు. సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ, "ఇది సింధూరానికి చేయబడ్డ దౌర్జన్యానికి సముచిత ప్రతిస్పందన. ప్రతి అహింసావాది ఈ చర్య విజయవంతం కావాలని ఆశించాలన్నారు.

# ఉప లోకాయుక్తను కలిసిన సీడబ్ల్యూసీ చైర్ పర్సన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర ఉప లోకాయుక్త, రిటైర్డు న్యాయమూర్తిని బీఎస్ జగ్జీవన్ కుమార్ ను బుధవారం వివిధ కార్యక్రమాలలో పాల్గొనే నిమిత్తం హనుమకొండకు రాగా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ అన్నమనేని అనిల్ చందర్ రావు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. న్యాయమూర్తిగా పదవీ విరమణ చేశాక ఇటీవల రాష్ట్ర గవర్నర్ చే ఉపలోకాయుక్తగా నియనింపబడిన తర్వాత తొలిసారి హనుమకొండకు రాగా అనిల్ చందర్ రావు మర్యాదపూర్వకంగా కలుసుకొని బాలల పరిరక్షణ అంశాలను వివరించారు. లోకాయుక్త కేసులు విచారణ పరిధి, ప్రజల్లో లోకాయుక్త పని విధానం అవగాహన కల్పించడం గురించి చర్చించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది పుప్పాల శ్రీనివాస్, లేబర్ కోర్టు సూపరిండెంటెంట్ మూర్తి, కోర్టు సిబ్బంది శివ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికి సుధాకర్, ఉప లోకాయుక్త జీవన్ కుమార్ ను ఘనంగా సన్మానించారు.

# ఆపరేషన్ సింధూర్ విజయం పట్ల హర్షం

## టెర్రరిస్టులకు బుద్ధి చెప్పిన ఆర్మీకి సెల్యూట్

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద 15 రోజుల క్రితం అమాయక పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడికి ప్రతీకారంగా భారత్ ఆర్మీ చేపట్టిన "ఆపరేషన్ సింధూర్" విజయవంతంగా పూర్తి కావడం పట్ల భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు హర్షం వ్యక్తం చేశారు. ఆర్మీకి సెల్యూట్ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో, భారత్ ఎయిర్ ఫోర్స్ మంగళవారం అర్ధరాత్రి పాక్‌లోని నాలుగు, పీఓకేలోని ఐదు ఉగ్రవాద స్థావరాలపై మెరుపుదాడులు జరిపింది. ఈ దాడుల్లో టెర్రరిస్టుల ఆధారాలే కాదు, మౌలిక సదుపాయాలు కూడా ధ్వంసమయ్యాయి. లష్కరే తోయిబా సహా ఇతర ఉగ్రవాద సంస్థల నేతలు, టెర్రరిస్టులు భారీగా హతమయ్యారు. సామాన్య ప్రజలకు ఏ మాత్రం హాని కలగకుండా, లక్ష్యాన్ని ఖచ్చితంగా ఛేదించడం అభినందనీయమని వెంకట్రాములు పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్ ఉగ్రవాదులకు గట్టి బుద్ధి చెప్పిందని, ఇలాంటి చర్యలు దేశ భద్రతకు మేలుచేస్తాయని అన్నారు. పాకిస్తాన్ ఇప్పటికైనా టెర్రరిస్టులను పెంచిపోషించే ధోరణిని విడనాడకపోతే, దానికి తీవ్ర పరిణామాలు తప్పవని ఆయన హెచ్చరించారు. బార్డర్ ప్రాంతాల్లోని ప్రజల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత అప్రమత్తంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# వైభవంగా ఆరాధన వేడుకలు



**వరంగల్ వాయిస్, నడికూడ :** శ్రీ మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆరాధన వేడుకలు బుధవారం నడికూడ మండల కేంద్రంలోని విశ్వ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు కడివెండి నరేందర్ చారి ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. వీర బ్రహ్మేంద్రస్వామి చిత్రపటానికి పూలమాలలు అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారాల నడుమ పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి పాలకాయలు సమర్పించి, కర్పూర హారతి ఇచ్చి పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కుడ్ల మల హల్ రావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎలకంటి రాజు చారి, ఉపాధ్యక్షుడు బెజ్జంకి రాజేందర్ చారి, కార్యవర్గ సభ్యు లు క్రిష్ణాది సాంబయ్య చారి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# బాధితుడికి మొబైల్ అప్పగింత




**వరంగల్ వాయిస్, రేగొండ :** భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన మంతెన రాజు ఇటీవల రేగొండ నుంచి భూపాలపల్లి వెళ్తుండగా తన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నారు. వెంటనే ఆయన రేగొండ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించగా, అక్కడి పోలీసులు సీఈఐఆర్ (Central Equipment Identity Register) పోర్టల్ ద్వారా ఫోన్ వివరాలు నమోదు చేశారు. తగిన చర్యల ద్వారా ఫోన్‌ను గుర్తించిన పోలీసులు బుధవారం రేగొండ ఎస్సై ఎన్. సందీప్ కుమార్ చేతుల మీదుగా మొబైల్‌ను బాధితుడికి అప్పగించారు. సుమారు రూ. 25,000 విలువైన మొబైల్ తిరిగి లభించడంతో బాధితుడు మంతెన రాజు రేగొండ పోలీసులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై ఎన్.సందీప్ కుమార్ మాట్లాడుతూ "ప్రజలు వారి మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నా, లేదా దొంగతనానికి గురైనా, వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో (www.ceir.gov.in) నమోదు చేయగలరు. ఈ పోర్టల్ ద్వారా ఫోన్ ట్రేస్ చేసి తిరిగి పొందే అవకాశాలు ఉన్నాయి. ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని పేర్కొన్నారు.

# హాస్పిటల్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్, కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేపడుతున్నామని దానిని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ కోరారు. బుధవారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరిండెంట్ కు సమ్మె నోటీసులు తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సీఐటీయూ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా రాగుల రమేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేకమైన లేబర్ కోడులను తీసుకువచ్చి కార్మిక హక్కులను హరించి వేస్తున్నారన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న పనిగంటలు కనీస వేతనాలు పని భద్రతకు సంబంధించిన హక్కులకు ప్రమాదం ఏర్పడిందని దాని కోసం సమ్మె చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగ కార్మికులతో నింపాలని రమేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సిఐటియు యూనియన్ నాయకులు ఏ.అనిల్, కె కళావతి, కోమల, రజిత, సబీర, పుష్ప, సంధ్య, సదానందం, కర్ణకర్, రమాదేవి, సావిత్రి పాల్గొన్నారు.

# ఘనంగా వీర బ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం

● పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ పరిధిలోని నాగారం గ్రామంలో విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి వారి చతుర్థ ఆరాధన మహోత్సవ కార్యక్రమాన్ని కుల పెద్దలు ఘనంగా నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ విశ్వ బ్రాహ్మణ సంఘం కమిటీ సభ్యులు మాట్లాడుతూ బ్రహ్మం



గారి చతుర్థ ఆరాధన మహోత్సవ కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. గత నాలుగు సంవత్సరాల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రామస్థులు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో విశ్వ బ్రాహ్మణ సంఘం కమిటీ సభ్యులు, గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సాహితీ వేత్తలతో పొన్నాల లక్ష్మయ్య భేటీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య తన స్వగృహంలో వరంగల్ ప్రాంతానికి చెందిన ప్రముఖ సాహితీవేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాహిత్య కళా రంగం, దాని ప్రస్తుత స్థితిగతులు, అభివృద్ధి మార్గాలపై విస్తృతంగా చర్చ జరిగింది. సాహిత్యం పట్ల తనకు ఉన్న మక్కువను తెలియజేసిన పొన్నాల లక్ష్మయ్య సాహిత్య అభివృద్ధికి తాను అన్నివిధాలా తోడ్పాటును అందించేందుకు సిద్ధమని చెప్పారు. ఈ సందర్భంగా సాహితీవేత్తలు కూడా తమ అభిప్రాయాలను పంచుకున్నారు. సాహిత్యాన్ని మరింత ప్రజలకు చేరువ చేయాలన్న ఉద్దేశంతో, విధివిధానాలను సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్తులో సాహిత్య కార్యక్రమాలను నిర్వహించాలనే నిర్ణయానికి వచ్చారు. ఈ సమావేశంలో డా. బన్న ఐలయ్య, పొట్లపల్లి శ్రీనివాసరావు, గన్నమరాజు గిరిజ మనోహర్ బాబు, పి.చందా, సీనియర్ కవి వీఆర్ విద్యార్థి, మంతెన శంకర్, ప్రముఖులు పాల్గొన్నారు.

# ఉద్యోగులపై ముఖ్యమంత్రి వ్యాఖ్యలు అనుచితం

## యూఎస్పీసీ వరంగల్ జిల్లా నాయకులు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ, వరంగల్ జిల్లా శాఖ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో యునైటెడ్ స్ట్రగుల్ కమిటీ (యూఎస్పీసీ) నాయకులు మాట్లాడుతూ, ఉద్యోగులు, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతగా స్పందించలేదని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేకమార్లు ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు తదితరులను కలిసి వినతిపత్రాలు సమర్పించినా, ప్రభుత్వపు నిర్లక్ష్య వైఖరి కారణంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్యవేదిక (టీజీఈజేఏసీ) నేతృత్వంలో ఉద్యమ కార్యాచరణ ప్రకటించాల్సి వచ్చిందన్నారు. ఉద్యోగులు అడిగేది తాముగా పొందాల్సిన హక్కులకే సంబంధించినది, ఏ విధంగానూ అదనపు కోరికలు పెట్టడం లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలం నుంచే పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు, పీఆర్సీ అమలు, హెల్త్ కార్డుల జారీ, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, జడ్పీ–జీపీఎఫ్, టీఎస్ జీఎల్ఐ లోన్ల మంజూరు వంటి విషయాల్లో ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకపోవడం బాధాకరమని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రజాప్రతినిధిగా, ప్రభుత్వ అధిపతిగా, తండ్రిగా వ్యవహరించి ఉద్యోగులతో చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించాలని, బహిరంగ వేదికలపై అవమానకర వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై యూఎస్పీసీ వరంగల్ జిల్లా శాఖ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. తక్షణమే జేఏసీ నాయకులను చర్చలకు ఆహ్వానించి సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరంగా కొనసాగిస్తామని హెచ్చరించారు. యూఎస్పీసీ జిల్లా నాయకులు సి.సుజన్ ప్రసాద రావు, యు.అశోక్, కె.నరసింహులు, టి.ఆనందచారి, ఎం.నరసింహ చారి, కె.సదానందం పాల్గొన్నారు.

# నూతనంగా ఎంపికైన జేసీజేలకు సన్మానం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** లా' చదివి సమాజంలోని సమస్యలు పరిష్కరించాలనే ఆలోచన చాలామందికి వస్తుంది. ఐతే కొందరే ఆ దిశగా అడుగేస్తారని వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలుస సుధీర్ అన్నారు. ఇటీవల జ్యుడీషియల్ ఫలితాల్లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన ముగ్గురు మహిళా న్యాయవాదులు, ఒక న్యాయశాఖ ఉద్యోగికి బుధవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన గంగిశెట్టి ప్రసీద, అంబటి ప్రణయ, దార సాయిమేఘన, న్యాయ శాఖ నుంచి ఎంపికైన లాడే రాజులను వరంగల్, హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్లు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ వారు ఎంతో కష్టపడి విజయం సాధించినందుకు వారికి వారి కటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. యువ న్యాయవాదులు వారిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఎంత ఎదిగిన ఒదిగి ఉండాలని వరంగల్ బార్ అసోసియేషన్ మరువద్దని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో







వరంగల్ , హనుమకొండ జిల్లా బార్ అధ్యక్షులు వలుస సుధీర్, పులి సత్యనారాయణ, కార్యదర్శులు డి. రమాకాంత్, కే. రవి, బార్ కౌన్సిల్ సభ్యులు బి.జయాకర్, సీనియర్ న్యాయవాదులు యం.సదాశివుడు, ప్రసాద్, అంబారీష్ రావు, కె.నరసింహ రావు, వి.వెంకటేశ్వర్లు, శామంతుల శ్రీనివాస్, గునిగంటి శ్రీనివాస్, అల్లం నాగరాజు, మేరుగు సుభాష్, ఆర్.సురేష్, మహిళ న్యాయవాదులు వైస్ ప్రెసిడెంట్ మైదం జయపాల్, జాయింట్ సెక్రటరీ ముసిపట్ల శ్రీధర్ గౌడ్, లేడీ జాయింట్ సెక్రటరీ రేపూరి శశిరేఖ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ శివ ప్రసాద్, లైబ్రరీ సెక్రటరీ కిషోర్ కుమార్, ట్రెజరర్ సిరిమల్ల అరుణ, 30 ఇయర్స్ సీనియర్ ఈసీ సిరబోయిన శ్రీనివాస్, 20 ఇయర్స్ సీనియర్ ఈసీ ఇజ్జగిరి సురేష్, 10 ఇయర్స్ సీనియర్ ఈసీ కలకోట్ల నిర్మల జ్యోతి, ఈసీ మెంబర్లు మర్రి రాజు, రవి, మేఘనాథ్, మహేందర్, తోట అరుణ, కార్యవర్గ సభ్యులు, వద్దిరాజు గణేష్, గుడిమల్ల రవికుమార్, మాతంగి రమేష్ బాబు, అయిత ప్రసాద్, టీసీ.సుజాత, ఆందాలు, శ్రీలత, వాణిశ్రీ, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఓంకార్ శతజయంతి సభలను జయప్రదం చేయండి

## ● గడ్డం నాగార్జున పిలుపు

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వరంగల్ జిల్లా మచ్చాపూర్ లో ఈ నెల 12న కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ 125 అడుగుల స్మారక స్తూపాన్ని పునః ప్రారంభిస్తూ, ఓంకార్ శతజయంతి వార్షికోత్సవ ప్రారంభ సభలు జరగనున్నాయి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కామ్రేడ్ ఓంకార్ వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, ప్రజల ప్రియ నేతగా ప్రసిద్ధి చెందారని తెలిపారు. అసెంబ్లీలో తన ధైర్యసాహసాలతో 'అసెంబ్లీ టైగర్'గా పేరుగాంచిన ఓంకార్ ప్రజల సంక్షేమానికే తన జీవితం అంకితం చేశారని గుర్తుచేశారు. తన ఉద్యమంలో భాగంగా లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచి, తెలంగాణ రైతాంగ పోరాటాన్ని ముందుండి నడిపించిన గొప్ప కమ్యూనిస్టుగా ఆయన నిలిచారని అన్నారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ, రాష్ట్రాభివృద్ధి కోసం అసెంబ్లీలో సుదీర్ఘ ప్రసంగాలు చేసి ప్రభుత్వ వైఖరిని కఠినంగా ఎండగట్టారని చెప్పారు. నక్సలిజంపై ప్రభుత్వ దృష్టికోణాన్ని విమర్శిస్తూ శాంతియుత మార్గాలను సూచించారని, ఎన్నో హత్యాయత్నాల నుంచి బయటపడుతూ "మృత్యుంజయుడు"గా నిలిచారని పేర్కొన్నారు. 1984లో ఎంసీపీని స్థాపించిన ఆయన, 2006లో ఎంసీపీఐ(యు)గా పునః సంస్థీకరించిన దిశగా పార్టీని దేశవ్యాప్తంగా వ్యాపింపచేసిన ఘనత



ఆయనదేనని తెలిపారు. 1986లోనే కులవ్యవస్థ వర్గాల వ్యవస్థలో భాగమేనని, అంబేద్కర్ ఆలోచనలను మార్క్స్ సిద్ధాంతాలతో మిళితం చేయాల్సిన అవసరాన్ని ఆయన ముందుగానే గుర్తించారని చెప్పారు. 1999లో నాలుగు రాజకీయ పార్టీలను, 14 కుల సంఘాలను ఏకం చేసి మహాజన ఫ్రంట్‌ను ఏర్పాటు చేయడం ద్వారా సామాజిక సమతుల్యానికి నాంది పలికారని వివరించారు. 2000లో విద్యుత్ ఉద్యమాన్ని నిర్మించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, కమ్యూనిస్టు పార్టీల ఐక్యత కోసం నిరంతరంగా కృషి చేశారని చెప్పారు. ఆయన జీవిత చరిత్ర అనిర్వచనీయమైనదని, తరతరాల ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తుందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చీపురు ఓదయ్య, జిల్లా కమిటీ సభ్యులు మొగిలి శ్రీనివాసరావు, అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు అన్నబోయిన ప్రేమలత, పార్టీ సభ్యులు పోకల సుధీర్, విజయ్, అనితా దేవి, బుల్లి యూసుఫ్, అరుణలక్ష్మిపాల్గొన్నారు.

# 20న ఇందిరా పార్క్ ఎదుట మహా ధర్నా



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వద్దేపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మల్లికకు ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ మే 20న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ ఇందిరా పార్క్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "ఇందిరా పార్క్ మహాధర్నా"ని విజయవంతం చేయాలని ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. ఈ మహాధర్నా ద్వారా ఎన్‌హెచ్ఎంలోని 78 క్యాడర్లలో పనిచేస్తున్న 17,541 మంది ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డ్, హెల్త్ ఇన్సూరెన్స్, పెషన్ రూ. 25,000, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు అందించాలనే డిమాండ్లను ప్రభుత్వానికి వినిపించనున్నారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధించేందుకు ఈ ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వద్దేపల్లి ఆరోగ్య కేంద్రం పబ్లిక్ హెల్త్ మేనేజర్ మానస, ఏఎన్ఎంలు అనిత, జై షీలా, విజయ, వసంత, అకౌంటెంట్ మంజుల, ఫార్మసిస్ట్ అనూష, సపోర్టింగ్ స్టాఫ్ సబిత, అలాగే హనుమకొండ జిల్లా ఏఐటీయూసీ సమితి సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ ధర్నా ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి ఉద్యోగుల హక్కులు సాధించేందుకు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# డీఎంహెచ్ఓకు వినతిపత్రం సమర్పణ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా డీఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ అల్లం అప్పయ్యకు మే 20న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాలో పాల్గొనబోతున్న విషయాన్ని తెలియజేస్తూ ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ వినతిపత్రాన్ని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ, మే 20న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద, ఉద్యోగుల హక్కుల సాధనకై నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఎన్ హెచ్ఎం ఆల్ క్యాడర్స్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఎన్ హెచ్ఎంలో 78 క్యాడర్స్‌లో సుమారు 17,541 మంది ఉద్యోగులు సేవలందిస్తున్నారని తెలిపారు. ఈ ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు మేరకు "సమాన పనికి సమాన వేతనం" అమలు చేయాలని, ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా, హెల్త్ కార్డు వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, 61 సంవత్సరాలు పూర్తి చేసిన ఉద్యోగులకు నెలకు రూ.25,000 పెన్షన్ ఇవ్వాలి, రిటైర్మెంట్ సమయంలో రూ.10 లక్షల బెనిఫిట్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యల శాశ్వత పరిష్కారం కోసం నిర్వహించే ఈ మహాధర్నాలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు బత్తుల విష్ణుమూర్తి, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మసీ ఆఫీసర్ రిజల్ట్స్‌పై టీజీపీఓఏ ప్రతినిధుల భేటీ

## 12న ఫలితాలు విడుదలకు హామీ

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీపీఓఏ) సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్ నేతృత్వంలో ఒక ప్రతినిధి బృందం మెడికల్, హెల్త్ సర్వీసెస్ రిక్రూట్ మెంట్ బోర్డు చైర్మన్ ఎస్.గోపి కాంత్ రెడ్డిని వారి కార్యాలయంలో కలిసి, ఫార్మసీ ఆఫీసర్ రిజల్ట్స్ విషయంలో చర్చలు జరిపింది. రాష్ట్రవ్యాప్తంగా ఫార్మసీ ఆఫీసర్లు గత ఆరు నెలలుగా ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారని వారు పేర్కొన్నారు. దీనిపై చైర్మన్ వెంటనే స్పందించి, ఫలితాలను ఈ నెల 12న విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్ బాబు, అడ్వైజర్ అహ్మద్ ఉల్లా ఖాన్, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు వి. సుధాకర్ రెడ్డి, వరంగల్ జిల్లా సెక్రటరీ ఎం. అవినాష్, రాష్ట్ర నాయకులు జహీర్, విజయ్ కుమార్, రాజు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



# 8న కౌకొండలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని కౌకొండ గ్రామంలో ఈనెల 8 గురువారం రోజున రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్ తెలిపారు. తెలంగాణ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాబోవు వానాకాలం 2025లో సాగు చేసే, సాగుకు అనువైన అన్ని రకాల పంటలపై ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలచే 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# తల్లి స్మారకంగా గుడికి విరాళం



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని కాకతీయుల శ్రీ పట్టాభి రామాలయం అభివృద్ధికి బుధవారం శ్రీరామ భక్తుడు మచ్చిక ముఖేష్ గౌడ్ టీచర్ తన తల్లి కీర్తిశేషులు మచ్చిక సారమ్మ జ్ఞాపకార్థం రూ.10,000 విరాళంగా ఇచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ తెలిపారు. విరాళం ఇచ్చిన దాతకు శ్రీరామ కృప లభించి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి ముసునూరి నరేష్, భక్తులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక విడుదల



**వాయిస్ వరంగల్, హనుమకొండ :** పద్మాక్షి రోడ్డులో ఉన్న హనుమత్గిరి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను బుధవారం విడుదల చేశారు. ఉత్సవాలు ఈ నెల 13న గణపతి పూజ, పుణ్యవచనం, మండపారాధనతో ప్రారంభం కానున్నాయి. 14న 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, అదే రోజున ఉదయం 10 గంటలకు శ్రీ సీతారామచంద్ర స్వామికి అష్టోత్తర శతకటాభిషేకం నిర్వహించబడుతుంది. 19న ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు భక్తుల లోక కళ్యాణార్థం 108 కలశాలతో అఖండ రామనామ పారాయణ మహోత్సవం జరుగుతుంది. 20న ఉదయం 6:30 నుంచి శ్రీ హనుమాన్ చాలీసాను 108 సార్లు సామూహికంగా పారాయణం చేయనున్నారు. 21న ఉదయం 7 గంటలకు స్వామి దర్శనంతో మహానగరంలో శోభాయాత్ర నిర్వహించనున్నారు. 22న హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, చందన సేవ, మూల విరాటుకు అలంకరణ, అర్చనలు దేవాలయ అర్చకుడు ఆరుట్ల రామాచారి ఆధ్వర్యంలో జరుగనున్నాయి. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు శ్రీ ఆంజనేయ మున్నూరు కాపు పర్వస్ సంఘం ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ ఉచితంగా భక్తులకు పంపిణీ చేయబడుతుంది. ప్రతిరోజూ భక్తుల సహకారంతో మహా ప్రసాద వితరణ చేపడుతున్నారు. ఈ కార్యక్రమాల్లో కమిటీ సభ్యులు గందె కృష్ణ, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, కరుదశద్ కుమార్, గంద్రతి సుధాకర్, శంకర్, మొగులయ్య, సమ్మయ్య, హనుమాన్ స్వాములు పాల్గొన్నారు.

## హలో యువత... చలో తిరుపతి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్‌లోని సీపీఐ కార్యాలయం వద్ద, శివనగర్ ఎదురుగా, ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల పోస్టర్లను ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దక్షిణ భారతదేశంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాముఖ్యత కలిగిన తిరుపతిలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభలు జరగనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి 1000 మందికి పైగా యువజన ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న యువజన వ్యతిరేక విధానాలు, నియంతృత్వ ధోరణులు, కార్పొరేట్ ప్రాభల్యం, విద్యా, వైద్యం, ఉపాధి, సామాజిక, ఆర్థిక అంశాలపై ఈ సభలో చర్చలు జరగనున్నాయి. చట్టసభలు, రాజకీయాలు, మీడియా వంటి కీలక వ్యవస్థలు కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లిపోతున్న పరిస్థితులపై భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించనున్నారు. మహాసభ ప్రారంభమయ్యే మే 15వ తేదీన, వేలాది మంది యువత పాల్గొనే భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. "యువతరం శివమెత్తితే – నవతరం గళమెత్తితే... లోకం మారిపోదా? చీకటి మాయ మాసిపోదా?" అనే నినాదంతో ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్, హసీనా, విజయ్, కిరణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ




**వరంగల్ వాయిస్, చిట్యాల :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని ఎమ్మెల్యే మినీ క్యాంప్ కార్యాలయంలో చిట్యాల మరియు టేకుమట్ల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 47 మంది కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్దిదారులకు రూ.47,05,452 విలువైన చెక్కులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ పేదింటి ఆడపడుచులకు అండగా కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ అండగా ఉంటుందన్నారు. పేద ప్రజల సంక్షేమమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. రాష్ట్రంలో మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పంపిణీ కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే లబ్ధిదారులు, అధికారులతో కలిసి గ్రూపు ఫొటో దిగారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు, అధికారులు ఉన్నారు.

## అగ్ని ప్రమాదంలో పంట దగ్ధం



**వరంగల్ వాయిస్, చిట్యాల :** భూపాలపల్లి జయశంకర్ జిల్లా చిట్యాల మండలం శాంతినగర్ గ్రామంలో కత్తుల ఓదెలు అనే రైతుకి సంబంధించిన రెండు ఎకరాలలో మక్క పంట పండించడం జరిగింది. బుధవారం మధ్యాహ్నం సుమారు 3: 20 నిమిషాలకు అధికంగా ఎండ ఉండడం వల్ల పంట చేనులో అనుకోకుండా మంటలు వ్యాపించి రెండు ఎకరాల పంట పూర్తిస్థాయిలో దగ్ధమైంది. సుమారు 100 కింటాల మక్కలు ఉన్నట్టుగా రైతు ఓదెలు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుచేసి పంటకు పెట్టుబడి పెట్టి చేతికి అందే టైంలో మంటలో కాలిపోవడంతో రైతు కన్నీరు మున్నీరయ్యారు. బాధిత రైతు ప్రభుత్వం నుంచి సాయం అందించాలని అధికారులను కోరారు.

# కాంగ్రెస్ పార్టీని, కార్యకర్తలను కాపాడుకుంటాం

### ◆ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి




**వరంగల్ వాయిస్, పరకాల :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అధిష్టానం చర్యలు చేపట్టిందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. బుధవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల నియోజకవర్గ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ అబ్జర్వర్లు మస్కుద్ అహ్మద్ అమీర్ అలీ ఖాన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు దొమ్మాటి సాంబయ్య, వరంగల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు ఎర్రబెల్లి స్వర్ణ, ఏఐసీసీ ఎస్సీ కోఆర్డినేటర్ డాక్టర్ పులి అనిల్ కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కూచన రవళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును ప్రజల్లోకి బలంగా తీసుకవెళ్లాలని భావిస్తోందన్నారు. 100శాతం ఏకగ్రీవానికి మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. సంస్థాగత నిర్మాణం బలంగా ఉంటే పార్టీకి ఢోకా ఉండదని భావిస్తున్న పార్టీ పెద్దలు ఆ దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. మే 20 నాటికి డీసీసీ అధ్యక్షులను మే నెలాఖరు వరకు గ్రామ, మండల, బ్లాక్ కాంగ్రెస్ కమిటీల నియామకాలు పూర్తి చేసేందుకు జిల్లాకు ఇద్దరు పీసీసీ పరిశీలకులుగా వచ్చారన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జిగా మీనాక్షి నటరాజన్ నియమితులైన నాటి నుంచి రాష్ట్రంలో ప్రభుత్వ పని తీరు, పార్టీ పరిస్థితిపై అధ్యయనం చేశారు. ఒక నివేదికను పార్టీ అధిష్టానానికి అందించిన నటరాజన్ పార్టీ బలోపేతంపై దృష్టి సారించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటికే రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశాలు పార్టీ ముఖ్యులతో సమావేశాలు నిర్వహించారన్నారు. మే నెలా ఖరులోగా గ్రామ, మండల, బ్లాక్ కాంగ్రెస్ కమిటీల నియామకాలు పూర్తి చేయాలని అన్నారు. గ్రామ, మండల అధ్యక్ష పదవులకు ఐదుగురి పేర్లను, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు ముగ్గురి పేర్లను టీపీసీసీకి పంపించాలని, పదవుల భర్తీలో సామాజిక సమతౌల్యాన్ని పాటించాలని అన్నారు. ఏ ఒక్క పదవికి కూడా ఒకే సామాజిక వర్గానికి చెందిన వారి నుంచి రెండు పేర్లు పంపొద్దని ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నుంచి ఒక్కొక్కరి పేరు పంపాలని అన్నారు. 2017 నుంచి పార్టీ మారని వారికే అవకాశం కల్పించాలని అధిష్టానం సూచించారని, గ్రామ, మండల, బ్లాక్, జిల్లా కాంగ్రెస్ కమిటీల నియామకాలు పూర్తయిన తర్వాత ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు, ఇతరత్రా అంశాల గురించి విస్తృతంగా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు.

# పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను చేరుకోండి



### ➲ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**వరంగల్ వాయిస్, జనగామ :** విద్యార్థులు పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జరిగిన "విజయోస్తు సన్మాన సభ"లో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఆశయాలను చేరుకోవడంలో ఆత్మవిశ్వాసం కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్సీ–2025 పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. జనగామ జిల్లా రాష్ట్రవ్యాప్తంగా మూడవ స్థానాన్ని సంపాదించిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 129 పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించడమే ఈ సన్మాన కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు. విద్యార్థుల విజయాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్లు, మండల నోడల్ అధికారులు ఎంతో కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. విద్యార్థుల శిక్షణలో స్మార్ట్ లెర్నింగ్ మెటీరియల్ ఎంతో సహాయపడిందని తెలిపారు. పదో తరగతి తర్వాత విద్యార్థులు ఏ దిశలో వెళ్లాలో అయోమయంలో ఉంటారని, వారు తమ ఆసక్తి, ఆర్థిక స్థితి, భవిష్యత్ డిమాండ్‌ను పరిశీలించి ఉత్తమమైన మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఉన్నత చదువుల వైపు ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో ఉత్తమ మార్కులు సాధించిన 23 మంది విద్యార్థులకు సైకిళ్లు బహుమతిగా అందించగా, 129 మంది ప్రధానోపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ భోజన్న, బీసీ సంక్షేమ అధికారి రవీందర్, ఎస్సీ సంక్షేమ అధికారి విక్రమ్, డీఐఈఓ జితేందర్ రెడ్డి, రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పెద్ది వెంకట నారాయణ గౌడ్ తదితర అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిరుపేదలైన అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

### ● గృహ నిర్మాణ కార్పొరేషన్ ఎండీ వీపీ.గౌతమ్



**వరంగల్ వాయిస్, జనగామ :** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అర్హులైన నిరుపేదలకు ఇళ్లను అందించడమేనని గృహ నిర్మాణ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ తెలిపారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్‌లతో కలిసి ఆయన జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్లు పూర్తిగా అర్హులకే మంజూరయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా ఉండాలన్నారు. ప్రతి ఇల్లు 400 స్క్వేర్ ఫీట్ కంటే తక్కువగా, 600 స్క్వేర్ ఫీట్ కంటే ఎక్కువగా ఉండకూడదన్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి ఇప్పటికే ఒకదశ నగదు జమ చేసినట్టు చెప్పారు. ఇళ్ల నిర్మాణంలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించేందుకు అధికారులు అవగాహన పెంచుకోవాలన్నారు. తొలి విడత పనులు మంచి పురోగతిలో ఉన్నాయని, ఇంకా పెండింగ్‌లో ఉన్న మార్కింగ్ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని సూచించారు. ప్రతి సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో సమయానికి నమోదు చేయాలని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ, దరఖాస్తుదారుల అర్హతపై సర్వే వేగంగా కొనసాగించాలని సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద పైలట్ గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు సంబంధించిన వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశానికి ముందు, లింగాల ఘనపురం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను కలెక్టర్, అదనపు కలెక్టర్, ఎండీ కలిసి పరిశీలించారు. అలాగే వనపర్తి గ్రామంలో రెండో విడత పరిశీలనను, జిల్లా కేంద్రంలోని మోడల్ ఇంటి నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఇల్లు పొందే లబ్ధిదారులకు ఇళ్లు త్వరితగతిన అందేలా నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎండీ సూచించారు. సర్వే ప్రక్రియలో ఫార్మాట్ పత్రాలు నాణ్యంగా భద్రపరచాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తిస్థాయిలో సమగ్రంగా నిర్వహించాలని సూచించారు. ఈ సమీక్షలో గృహ నిర్మాణ శాఖ పీడీ మాత్రు నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీఓ గోపీరాం, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చైతన్య కుమార్‌తో పాటు అన్ని మండలాల ఎంపీడీఓలు, ఏఈలు తదితర అధికారులు పాల్గొన్నారు.

# వినోదాత్మక చిత్రం సింగిల్

**నవ్వించడం కష్టమన్న నటి కేతిక శర్మ**




'ఆద్యంతం వినోదంతో నిండిన సినిమా 'సింగిల్'. ఈ చిత్రం చూస్తున్నంత సేపు మనస్ఫూర్తిగా నవ్వుకుంటూనే ఉంటారని అంటోంది నటి కేతిక శర్మ. శ్రీవిష్ణు జంటగా నటించిన ఈ చిత్రాన్ని కార్తీక్ రాజు తెరకెక్కించారు. ఇవానా మరో కథానాయిక. ఈ సినిమా ఈనెల 9న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో కేతికహైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకుంది. గీతా ఆర్ట్స్ సంస్థలో చేయాలని ఎప్పటి నుంచో నా కోరిక. అది ఈ సినిమాతో నెరవేరినందుకు ఆనందంగా ఉంది. నేను ఈ కథ వింటున్నంత సేపు నవ్వుతూనే ఉన్నా. ఇది పూర్తిగా రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్‌గా ముస్తాబైంది. దీంట్లో ప్రేమకథ కూడా చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఇందులో నేను పూర్వా అనే పాత్రలో కనిపిస్తాను. తను చాలా ప్రాక్టికల్‌గా ఉండే అమ్మాయి. ఈ కథలో ఎమోషన్ తన పాత్ర ద్వారానే వస్తుంది. ఈ పాత్ర అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుందని తెలిపింది. ఈ చిత్ర విషయంలో కామెడీ నాకు చాలా కష్టంగా అనిపించింది. ఎందుకంటే వినోదం పండిరచడం అంత తేలికేం కాదు. అందులోనూ కామెడీ టైమింగ్ విషయంలో శ్రీవిష్ణును మ్యాచ్ చేయడం మరింత కష్టం. ఈ సినిమాలో ఇంటర్వెల్ ఎపిసోడ్ చాలా సవాల్‌గా అనిపించింది. ప్రేక్షకులు పొట్టచెక్కలయ్యేలా నవ్వుకునేలా కార్తీక్ ఈ చిత్రాన్ని రూపొందించారని చెప్పింది. రాబిన్‌హుడ్'లోని నా ప్రత్యేక గీతం 'అదిదా సర్‌ప్రైజ్'కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడం సంతోషాన్నిచ్చింది. అయితే ఆ పాట విషయంలో తలెత్తిన వివాదం నుంచి ఓ విషయం నేర్చుకున్నా. భవిష్యత్తుల్లో అలాంటి పాటలు చేసేటప్పుడు స్టెప్పుల విషయంలో మరింత జాగ్రత్త వహించాలని నిర్ణయించుకున్నా. ప్రస్తుతం నేను హిందీలో ఓ సినిమా చేస్తున్నా. అలాగే తమిళ తెలుగు ద్విభాషా చిత్రం ఒకటి చేస్తున్నా. మరికొన్ని సినిమాలు లైనప్‌లో ఉన్నాయి. వాటి వివరాల్ని త్వరలో ప్రకటిస్తారని కేతిక తెలిపింది.






## అమీర్‌తో అల్లు అర్జున్ భేటీ..

బాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఆమిర్ ఖాన్‌ను అల్లు అర్జున్ కలిశారు. ముంబయిలోని ఆమిర్ నివాసానికి వెళ్లిన బన్నీ ఆయనతో కలిసి కొంత సమయం ముచ్చటించారు. ప్రస్తుతం ఈ ఫొటో వైరల్ అవుతుండగా.. అభిమానులు వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తుందేమోనని ఆశిస్తున్నారు. ఇటీవల ఆమిర్‌ఖాన్ మాట్లాడుతూ తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'మహా భారతం' గురించి తెలిపారు. అందులో అగ్ర కథానాయకులు భాగం కానున్నట్లు– చెప్పారు. దీంతో బన్నీ ఈ ప్రాజెక్ట్‌లో నటించనున్నారా అనే సందేహాలు వస్తున్నాయి. ప్రస్తుతం అట్లీ– సినిమాతో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్. ఇందులో ఆయన ద్విపాత్రాభినయంలో నటించనున్నట్లు– వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం దీని ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇందులో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించనున్నారు. దీనికోసం అట్లీ, అల్లు అర్జున్ లాస్ ఏంజెలెస్‌లోని ప్రముఖ వీఎఫ్‌ఎక్స్ సంస్థను ఇటీ–వల సంప్రదించారు. ఇందులో హాలీవుడ్ తరహాలో విజువల్స్ ఉండనున్నట్లు– తెలిపారు.





## తెలుగు వెబ్ సీరిస్‌లోకి కోవై సరళ

లేడీ కమెడియన్ ఎవరంటే ఠక్కున గుర్తొచ్చే పేరు కోవై సరళ. అప్పట్లో ఇండస్ట్రీలో ఆమె పేరు మారుమోగింది. ముఖ్యంగా బ్రహ్మానందం, కోవై సరళ జోడికి ప్రత్యేకంగా ఫ్యాన్స్ ఉండేవారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో అనేక చిత్రాల్లో నటించి, తనదైన బాషతో డిఫరెంట్ ఎక్స్ ప్రెషన్స్ తో దాదాపు రెండు దశాబ్దాల పాటు కోవై సరళ అందరినీ మెప్పించింది. అయితే కారణాలు ఏవైనా ఆమె కొంతకాలంగా తెలుగు సినిమాలకు దూరమైంది. తెలుగు అని కాదు తమిళంలో కూడా అడపాదడపా సినిమాలు చేస్తోంది. అలా తెలుగులో డబ్ అయ్యి వచ్చిన సినిమాలను మాత్రమే తెలుగు వాళ్ళు చూసి ఆనందించాల్సిన వస్తుంది. అయితే తాజా సమాచారం ప్రకారం ఇప్పుడు కోవై సరళ ఓ తెలుగు వెబ్ సీరిస్ లో ఎంట్రీ ఇస్తోందట. యంగ్ హీరోయిన్ రీతూ వర్మ, శివ కందుకూరి జంటగా నటిస్తున్న వెబ్ సీరీస్ 'దేవిక అండ్ డానీ'. ఈ సిరీస్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్ ఇటీవలే రిలీజ్ అయింది. రీతూవర్మ కు ఇదే మొదటి వెబ్ సీరిస్. 'శ్రీకారం' మూవీ ఫేమ్ బి. కిశోర్ ఈ వెబ్ సీరిస్ ను డైరెక్ట్ చేశాడు. అతనితోపాటు– ఇందులో సూర్య వశిష్ఠ, సుబ్బరాజు, మౌనికా రెడ్డి, సోనియా సింగ్, చాగంటి సుధాకర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. జయ్ క్రిష్ దీనికి మ్యూజిక్ అందించాడు. త్వరలో ఈ వెబ్ సీరిస్ జియో హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ కానుంది. మరి కోవై సరళ కామెడీ కోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూస్తున్న తెలుగువారికి ఆమె ఈ వెబ్ సీరిస్ తో ఎలాంటి వినోదాన్ని పండిస్తుందో చూడాలి.





## ఓటీటీలోకి వచ్చేస్తున్న నితిన్ రాబిన్‌హుడ్

'సంక్రాంతి వస్తున్నాం', తదితర చిత్రాలను ఒకే సమయంలో అటు– ఛానల్‌లో, ఇటు– ఓటీటీలోకి తీసుకొచ్చింది 'జీ 5' సంస్థ. ఇప్పుడు 'రాబిన్‌హుడ్' విషయంలోనూ అదే ఫాలో అవుతోంది. మే 10న సాయంత్రం 6 గంటలకు ఈ సినిమా 'జీ తెలుగు' ఛానల్‌లో ప్రసారం కానుందని సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల తెరకెక్కించిన చిత్రం 'రాబిన్‌హుడ్'. ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఈ సినిమాతోనే తెరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. మార్చి 28న థియేటర్లలో విడుదలైందీ సినిమా. రామ్ అలియాస్ రాబిన్‌హుడ్ (నితిన్) ఎవరూ లేని అనాథ. తనలాంటి తోటి పిల్లలతో కలిసి ఓ అనాథ శరణాలయంలో ఆశ్రయం పొందుతుంటాడు. ఆకలి, అవసరాల కోసం నేరాలబాట పట్టిన రామ్.. తెలివిగా చోరీలు చేస్తూ అనాథ శరణాలయాలకు అండగా నిలుస్తుంటాడు. పెరిగి పెద్దయ్యాక కూడా అదే బాటలో అతడి ప్రయాణం కొనసాగుతుంది. బంగారం చోరీ కేసులో ఐపీఎస్ అధికారి విక్టర్ వర్ఘీస్ (షైన్ టామ్ చాకో) చేతికి చిక్కినట్లే చిక్కి త్రుటిలో తప్పించుకున్న రామ్, కొన్నాళ్ల తర్వాత నేరాలబాట వీడి ఉద్యోగం చేయాలనుకుంటాడు. అలా జాన్ సున్నిపెంట అలియాస్ జాన్ స్నో (రాజేంద్రప్రసాద్) నడుపుతున్న ఇండియాస్ నంబర్‌వన్ సెక్యూరిటీ– ఏజెన్సీలో చేరి, ఆస్ట్రేలియా నుంచి వచ్చిన నీరా వాసుదేవ్ (శ్రీలీ) రక్షణ బాధ్యతల కోసం రంగంలోకి దిగుతాడు. అసలు ఎవరీ నీరా వాసుదేవ్? ఆమె ఇండియాకి ఎందుకొచ్చింది?అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారం చేస్తున్న డ్రగ్ మాఫియా ఆమెని ఎందుకు టార్గెట్ చేసింది? అపాయంలోఉన్న నీరా వాసుదేవ్‌కి రామ్ రక్షణ కల్పించాడా లేదా? అనేది మిగతా కథ.



# పేదవారి కళ నెరవేర్చడమే లక్ష్యం

- **చిత్తశుద్ధితో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం**
- **రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**వరంగల్ వాయిస్, ములుగు :** రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ చిత్తశుద్ధితో అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అమలు చేస్తున్నామని, పేద వాడి కలలను నిజం చేయడానికి ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లాలోని వాజేడు మండలం టేకులగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజా, నాగారం నుంచి పాయబట్ల వరకు రూ.400 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు, రూ.150 లక్షల అంచనా విలువతో వాజేడు మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవన నిర్మాణం, ఎడ్చర్లపల్లి నుంచి ముత్తారం వరకు రూ.300 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం పనులను శంకుస్థాపనలు, రూ.14 లక్షలతో నిర్మించిన బేబీ బర్త్ వెయిటింగ్ భవనాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పీ శబరిష్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రాలతో కలిసి ప్రారంభించారు. అనంతరం కొంగాల గ్రామంలో 57 మందికి , నాగారం గ్రామంలో 64 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు. అనంతరం వెంకటాపురం మండలం కేంద్రంలో అంచనా విలువ రూ.60 లక్షలతో ఉపకార్య నిర్వాహక ఇంజనీర్ (పీఆర్) కార్యాలయ భవన నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. పాత్రపురం గ్రామంలోని రైతు వైదికలో జరిగిన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు మంత్రి అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రంలో రూ.8.19 లక్షల వేల కోట్లు అప్పులు చేసి ప్రజలపై పెను భారం మోపిందని ఆరోపించారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గత పాలకులు చేసిన అప్పులు తీర్చడంతో పాటు సంక్షేమ ఫలాలను అమలు చేస్తున్నామని వివరించారు. ప్రతి నిరుపేద ఆడబిడ్డకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు అందజేస్తుందన్నారు. వాజేడు, వెంకటాపూరం మండలాలలో నిరుపేదలు ఇండ్లు నిర్మించుకోవడానికి, పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఎన్నికలకు ముందు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు నూతన హామీలను అమలు చేయడానికి కార్యక్రమాలను చేపట్టిన ఈ సంవత్సరం ఉగాది నుంచి ధనికుడు తినే సన్నబియ్యాన్ని పేదలకు అందించాలన్న లక్ష్యంతో ప్రతి ఒక్కరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం అందజేస్తున్నామని అన్నారు. గతంలో పాలించిన దొర కాలంలో అరకొరగా ఉద్యోగ అవకాశాలు కల్పించగా నేటి ప్రజా ప్రభుత్వం పది నెలల కాలంలోనే 57,662 ఉద్యోగ అవకాశాలు కల్పించిందని, రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం భూ భారతి చట్టం తెచ్చి పేద రైతులకు చుట్టంగా మార్చిందని అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు భరోసా కల్పించాలని ఉద్దేశంతో రాజీవ్ వికాస్ పథకం కింద ఆర్థిక సహాయం చేయాలని లక్ష్యంతో అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని, అర్హులైన వారందరికీ జూన్ 2వ తేదీన ఆరువేల కోట్ల రూపాయలను అందజేయడం జరుగుతుందని అన్నారు. నిరుపేద విద్యార్థులకు నూతన పరిజ్ఞానంతో విద్యను బోధించడానికి చర్యలు తీసుకోవడంతో పాటు నిరుపేదలు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద వైద్య సేవలు పొందడానికి పది లక్షల రూపాయలను పెంచడం జరిగిందని అన్నారు. గత ప్రభుత్వం పేదల పట్ల సవతి తల్లి ప్రేమ కనపరిచినప్పటికీ నేటి ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి పేదల కన్నీళ్లను చూడచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. పేదవారి ఆశయాన్ని నెరవేర్చడం కోసం రాష్ట్రంలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను చేపట్టడం జరుగుతుందని, రానున్న రోజులలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి మెరుగుపరిన అనంతరం నూతన పథకాలను అమలు చేయడం జరుగుతుందని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ పీ శివం ఉపాధ్యాయ, డీఎఫ్ఓ రాహూల్ కిషన్ జాదవ్, ఆర్డీఓ వెంకటేష్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

- **జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**
- **ఇల్లందలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన**

**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలు లేని పల్లెలుగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. భూ భారతి అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలన్నారు. భూ భారతి పైలట్ ప్రాజెక్ట్ అమలవుతున్న వర్ధన్నపేట మండలం కట్రియాల, ఇల్లంద గ్రామాల్లో బుధవారం నిర్వహించిన భూభారతి సదస్సుల్లో కలెక్టర్ పాల్గొని రైతులకు చట్టంపై అవగాహన కల్పించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలపై రైతులు చేసుకొన్న దరఖాస్తులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆయా గ్రామాల రైతులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న భూ సమస్యలను తెలుసుకున్నారు. భూ భారతిపై అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వర్ధన్నపేటను పైలట్ మండలంగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. రెవెన్యూ సదస్సుల్లో భూ రికార్డుల తప్పులు, విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, సర్వే నంబర్ల మిస్సింగ్, పట్టా పాస్ పుస్తకాలు లేక పోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్ –బీ కింద చేర్చిన భూ ముల తదితర దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు. దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్ ల పనితీరును కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మండలంలోని ఇల్లంద వ్యవసాయ మార్కెట్ లో గల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకొని ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవలసిందిగా సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రావాణా జరిగేలా చూడాలని మిల్లర్లను కోరారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్ఓ విజయలక్ష్మి, డీఎం సివిల్ సప్లై సంధ్యారాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, తహసీల్దార్ విజయసాగర్, ఆర్డీఓ కార్యాలయ ఏవో రమేష్ సంబంధిత అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### లేఅవుట్ కమిటీ సమావేశం..

వరంగల్ జిల్లాలో లేఅవుట్ అనుమతుల కోసం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధ్యక్షతన లేఆవుట్ కమిటీ సమావేశం బుధవారం జిల్లా కలెక్టరేట్ లో జరిగింది. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా జీడబ్ల్యూఎంసీ పరిధిలో మూడు లే అవుట్ అనుమతుల కోసం ప్రతిపాదనలు రాగా వాటిని కమిటీ నిబంధనల మేరకు పరిశీలించి, సమావేశంలో చర్చించి అనుమతి మంజూరు చేశారు. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్వినీ తానాజీ వాఖేడే, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, డీటీసీపీ జ్యోతి, సిటీ ప్లానర్ రవీందర్, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి ఇజ్జగిరి, రోడ్ల భవనాల శాఖ, ఇరిగేషన్ శాఖ, ల్యాండ్స్ సర్వే విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా జై భీమ్ ర్యాలీ

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కొండా దంపతుల నాయకత్వంలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 26,27,28 డివిజన్లలో బుధవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజు ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, కార్పొరేటర్ అనిల్, బాలినే సురేష్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, భాషాపాక సదానందం, మడిపల్లి కృష్ణ, కొత్తపల్లి శ్రీనివాస్, కత్తెరశాల వేణుగోపాల్, చింతాకుల సునీల్, జారతి శ్రీనివాస్, జన్ను భాస్కర్, కురుమిళ్ళ సంపత్, ఎర్రం కమల్, పోలెపాక విశాల్ బాబు, ఇనుగల శరత్, మంద శ్రీనివాస్, కొమ్ము అమర్, పోలేపాక యాకోబు, గూడ శారద, కర్రే రమ, గుల్లపల్లి రామకృష్ణ, గూడ రమ్య, దౌడు నాగరాజ్, గూడ నవీన్, జన్ను జీవన్, కోగిల, యాకూబ్, కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్, కాంగ్రెస్ ముఖ్య నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్స్ అందజేయండి

- **బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే**
- **టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్ లను వెంటనే అందజేయాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో జరిగిన సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ల్యాండ్ రెగ్యులేషన్ స్కీమ్ ద్వారా 30,500 దరఖాస్తులను ప్రాసెసింగ్ చేయడం ద్వారా బల్దియాకు సుమారు రూ.130 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. డబ్బులు చెల్లించిన దరఖాస్తు దారులకు క్రమబద్ధీకరణకు చెందిన ప్రొసీడింగ్ లను అందజేయాలని సూచించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నగర వ్యాప్తంగా శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి నోటీసులు అందజేయాలని సూచించగా, ఇప్పటివరకు 348 భవనాలకు నోటీసులు అందజేసినట్లు సిటీ ప్లానర్ తెలిపారు. బడా భవనాలలో ఉన్న సెల్లార్ లలో ఏమైనా నిర్మాణాలు ఉంటే తొలగింపు, ఖాళీ చేయించాలని సెల్లార్ లలో ఉండే ఎలక్ట్రికల్ డివైజ్ లు మొదటి అంతస్తులో ఉండేలా చూడాలని, మోటార్ పంపు సెట్ లను అందుబాటులో ఉంచాలని, టీజీ బిపాస్ లో బిల్డింగ్ పర్మిషన్ లను నిర్దిష్ట గడువులోగా అనుమతిలు మంజూరు జరిగేలా చూడాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏసీపీలు శ్రీనివాస్ రెడ్డి, రజిత, ఖలీల్, నస్రీన్, టీపీఎస్ లు రోజా రెడ్డి, సుమన, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com